

గజ్వేల్ : 18వ వార్డులో ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, కమిషనర్ విద్యాధర్



సిద్దిపేట : 25 వార్డులో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

# 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ



జగదేవ్‌పూర్ : గొల్లపల్లిలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నది. ఈ మేరకు జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామ పంచాయతీల వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రజాపాలన కార్యక్రమం మొదటి రోజు పలు గ్రామాల్లో సరిపడా దరఖాస్తులు ఫారాలు లేకపోవడంతో గ్రామస్తులు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**– సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, డిసెంబర్ 28**

### మొదటి రోజు 21,036 దరఖాస్తులు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 28 : సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు ప్రజాపాలన కార్యక్రమానికి 21,036 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని 95 గ్రామ పంచాయతీల్లో 16,032 దరఖాస్తులు స్వీకరించారు. 5 మున్సిపాలిటీల్లో గల 115 వార్డుల్లో 5,004 దరఖాస్తులను స్వీకరించారు. మొదటి రోజు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మొత్తంగా 21,036 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

### గడుపు పొడిగించాలి

గజ్వేల్, డిసెంబర్ 28 : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ వచ్చే నెల 6 వరకు నిర్ణయించడం సరైంది కాదని, నెల రోజులపాటు గడువు పొడిగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల నుంచి తీసుకుంటున్న దరఖాస్తులకు నిర్ణీత గడువు ప్రకటించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒక్కో గ్రామ పంచాయతీలో ఒక్క రోజులోనే ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం సాధ్యం కాదని, నిరంతర ప్రక్రియగా ప్రజాపాలనను కొనసాగించాలన్నారు.

### హరితహారం చెట్ల తొలిగింపు

అక్కన్నపేట, డిసెంబర్ 28 : కేసీఆర్ ప్రభుత్వంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పెరిగి చెట్లు అయ్యాయి. గురువారం మండలంలోని గొల్లకుంటలో ప్రజాపాలన కార్యక్రమం జరుగుతుండగా, మరో పక్కన జేసీబీ సాయంతో హరితహారం చెట్లను తొలిగించారు. అక్కడే ప్రజాపాలన కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంపీవో కవి కుమార్, విద్యుత్ ఏఈ, ఇతర ప్రభుత్వ అధికారులు ఇదంత జరుగుతున్నా తమకేమీ పట్టనట్లుగా చూస్తుండిపోయారు. అయితే, మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ నుంచి పాఠశాలకు, మరో వ్యక్తి ఖాళీ జాగకు పైప్‌లైన్ వేసేందుకు చెట్లు అడ్డుగా ఉండడంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చెట్లను తొలిగించినట్లు పంచాయతీ కార్యదర్శి అమరేశ్ వివరించారు.

### రోడ్డు వెడల్పు తగ్గించాలి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 28 : రోడ్డు వెడల్పు తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ మేరకు భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో ఘటనాస్థలానికి సీఐ భానుప్రకాశ్, అధికారులు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మిట్టపల్లి గ్రామం మీదుగా వెళ్తున్న ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణం కోసం గతంలో అధికారులు 100 ఫీట్ల మార్కింగ్ చేశారని, ఆ మార్క్ ప్రకారం ఇండ్లు, వ్యాపార సంస్థలు నిర్మించుకున్నామని తెలిపారు. కానీ, ఇప్పుడు మళ్లీ పాత మార్క్ కంటే 25 ఫీట్లు పెంచడంతో తాము నిర్మించుకున్న ఇండ్లు, స్థలాలను కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించకపోవడంతో ఆందోళనకు దిగామన్నారు. భవిష్యత్‌లో జరిగే పోరాటాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ధర్నాలో నాయకులు పాల్గొన్నారు.

# సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

సిద్దిపేట, డిసెంబర్ 28 : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కోమండ్ల విక్రమ్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోల్‌కతాలో నిర్వహిస్తున్న ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కాన్ఫరెన్స్‌కు గురువారం టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై కోల్‌కతాలో ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



కాన్ఫరెన్స్ హాజరైన టీఎన్జీవోలు పరమేశ్వర్, విక్రమ్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాల్లో పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు మానుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేండ్ల నుంచి ఆదాయ పన్ను స్లాబులను పెంచకుండా ఉద్యోగులను ఇబ్బందులు పెడుతుందన్నారు. ప్రభుత్వం దాదాపుగా 2 నెలల జీతాలు (IT) పేరున దండుకుంటుందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని తీసుకురావాలన్నారు.

# ఈ-కేవైసీ కోసం జనం బారులు

గజ్వేల్, డిసెంబర్ 28 : పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద ఈ-కేవైసీ చేయించుకునేందుకు ఆయా గ్రామాలకు చెందిన వినియోగదారులు బారులుతీరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500కు గ్యాస్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంతో వినియోగదారులు ప్రతిరోజూ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో బారులుతీరి ఉంటున్నారు. గురువారం గ్యాస్ ఏజెన్సీ వద్ద వినియోగదారుల మధ్య గొడవ జరిగింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకొని క్యూలైన్‌ను సరిచేసి ఒక్కొకరిని ఏజెన్సీ కార్యాలయంలోకి పంపించారు. ఈ-కేవైసీ చివరి తేదీపై అధికారులు స్పష్టమైన అవగాహన కల్పించకపోవడంతో ప్రతిరోజూ వినియోగదారులు గజ్వేల్‌కు చేరుకుంటున్నారు. మరోవైపు జగదేవ్‌పూర్‌లోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద కూడా 20 రోజులుగా వినియోగదారులు బారులు తీరి ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ-కేవైసీపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



గజ్వేల్‌లోని గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులుతీరిన వినియోగదారులు



కబడ్డీ జూనియర్ బాలికల జట్టుతో అసోసియేషన్ సభ్యులు



కబడ్డీ జూనియర్ బాలుర జట్టుతో అసోసియేషన్ సభ్యులు

### జూనియర్ కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 28 : త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలకు జిల్లా జట్టును గురువారం గజ్వేల్ పట్టణంలో ఎన్నుకున్నారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్సీ సంతోష్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్ ఆధ్వర్యంలో క్రీడాకారులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ మండలాల నుంచి 150 మంది బాలురు, 60 మంది బాలికలు పోటీల్లో పాల్గొన్నారని, ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 11 నుంచి 14 వరకు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉమెన్ కమిటీ చైర్మన్ దండుగుల రాజ్యలక్ష్మి, యువజన నాయకులు దేశబోయిని నర్సింహులు, కోశాధికారి సత్యం తదితరులు పాల్గొన్నారు.



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

### నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 28 : సిద్దిపేట జిల్లా పద్మశాలీ సంఘం నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీశ్, పద్మశాలీ సంఘం రాష్ట్ర నేత బూర మల్లేశం, ప్రచార కార్యదర్శి ముదిగొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, పట్టణ అధ్యక్షుడు కాముని రాజేశం, గుండు భూపేశ్, డాక్టర్ స్వామి, భిక్షపతి, వైకుంఠం, బాలకిషన్, రమేశ్ పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

బెజ్జంకి, డిసెంబర్ 28 : మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఆలయ సమీపంలో చేపట్టే అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనులకు నిధులు ఎన్ని మంజూరయ్యాయి, పనుల్లో ఎందుకు ఆలస్యమవుతుంది..? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దాచారంలో జరిగిన అయ్యప్ప మహాపడి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

### రిపబ్లిక్ డే ఉత్సవాలకు కళాకారుల ఎంపిక

మిరుదొడ్డి, డిసెంబర్ 28 : జనవరి 26న ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే ఉత్సవాలకు మిరుదొడ్డి మండలంలోని అందె మ్యూజిక్ డప్పు అకాడమీకి చెందిన 16 మందికి మహిళా కళాకారులు ఎంపికైనట్లు అకాడమీ నిర్వాహకుడు అందె భాస్కర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రీయ భాషా సాంస్కృతిశాఖ సూచన మేరకు కేంద్ర సాంఘిక నాటక అకాడమీ ద్వారా రిపబ్లి డే ఉత్సవాలకు అందె మ్యూజిక్ డప్పు అకాడమీ మహిళా కళాకారులను ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. జనవరి 26న ఢిల్లీలో రిపబ్లిక్ డే ఉత్సవాల్లో కళాకారులు పాల్గొంటారని తెలిపారు.

### ఉపాధ్యాయుడికి విద్యారత్న అవార్డు

జగదేవ్‌పూర్, డిసెంబర్ 28 : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నరేందర్‌ను ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ విద్యారత్న అవార్డుతో సత్కరించారు. ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు 2023 సంవత్సరానికి పలు రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినవారిని ఎంపిక చేసి గాన లహరి సాహిత్య పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆదర్శ ఉపాధ్యాయుడు నరేందర్ ఉత్తమ బోధనకు విద్యారత్న అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు ఇందిరా ప్రధాన కార్యదర్శి విల్సన్ సినీనటుడు నిర్మాత పసునూరి శ్రీనివాసులు, సినీ నటుడు గౌతంరాజు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని సన్మానించారు.

### ఆడబిడ్డకు రూ.5016 కానుక

బెజ్జంకి, డిసెంబర్ 28 : మండల కేంద్రానికి చెందిన ఎండీ అస్మా, అజీమ్ దంపతులకు గురువారం ఆడబిడ్డ జన్మించింది. లింగాల యువసేన ఆధ్వర్యంలో దంపతులకు రూ.5016 కానుకను అందజేశారు. ఈ సందర్భంగా యువసేన కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ గ్రామంలో ఆడబిడ్డ జన్మిస్తే రూ.5016 అందిస్తామని తెలిపారు. కానుక అందించినవారిలో జంగిటి భీమయ్య, సునీల్, కర్తీక్, శ్రీనివాస్, మధు, పరశురాములు, శ్రీకాంత్, దిలీప్, ప్రవీణ్, అజయ్, రాజు పాల్గొన్నారు.

### వేణుగోపాలస్వామి సన్నిధిలో త్రిదండి జీయర్‌స్వామి

చేర్యాల, డిసెంబర్ 28 : పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని గురువారం త్రిదండి శ్రీమన్నారాయణ దేవానంద జీయర్‌స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామికి ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ నిత్యం దేవుడిని దర్శనం చేసుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మంగళగిరి శేషాచార్యులు, రాజు స్వామి, భక్తులు పాల్గొన్నారు.



ఆలయంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న జీయర్‌స్వామి